RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శుక్రవారం 06.02.2026 సంపుటి : 03 సంచిక : 64 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Friday 06.02.2026 Volume: 03 Issue 64 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు ఓకే



5లో

# నేడే ఫైనల్ పోరు



ఐసీసీ అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో యువ భారత జట్టు.. నేడు ఇంగ్లండ్‌తో జరుగబోయే ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఇరుజట్లు టోర్నీలో అపజయమన్నదే లేకుండా ఫైనల్ చేరి టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఈ టోర్నీలో భారత్ ఇప్పటికే 5 టైటిల్స్ గెలిచి ఆరో కప్పుపై కన్నేసింది.ఇంగ్లండ్‌కు మాత్రం 1998 తర్వాత మళ్లీ ట్రోఫీ దక్కలేదు. ఈసారి ఎలాగైనా 28 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలని ఆ జట్టు బరిలోకి దిగుతున్నది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభమయ్యే మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో వీక్షించొచ్చు.

## భారత్ ట్యాక్సీ సేవలు ప్రారంభం

**రెండేండ్లలో దేశవ్యాప్తంగా అమలు**

**తొలుత ఢిల్లీలో అందుబాటులోకి**




**న్యూఢిల్లీ:** సహకార యాజమాన్య నమూనాలో కేంద్రం సహకారంతో అమలవుతున్న భారత్ ట్యాక్సీ సేవలు గురువారం మొదటిసారిగా అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈ సేవలను న్యూఢిల్లీలో ప్రారంభించారు. ప్రస్తుతానికి ఈ సేవలు ఢిల్లీలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ సహకార వ్యవస్థలో ప్రయాణికులు చెల్లించిన చార్జీలను పూర్తిగా డ్రైవర్లే పొందవచ్చు. ప్రైవేట్ క్యాబ్ సర్వీసులతో పోలిస్తే భారత్ ట్యాక్సీలో చార్జీలు 30 శాతం తక్కువగా ఉంటాయి. రెండేండ్లలో దేశ వ్యాప్తంగా భారత్ ట్యాక్సీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా

# తీర్చిదిద్దుతాం



రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

కరీంనగర్‌ను పట్టిపీడిస్తున్న డంపు యార్డు సమస్యను పరిష్కరిస్తాం

కరీంనగర్-వరంగల్ నగరాల మధ్య డంపుయార్డు నెలకొల్పి విద్యుత ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం

కరీంనగర్‌కు రింగ్‌రోడ్డు మంజూరు చేస్తాం

కరీంనగర్, వరంగల్ నగరాలను కలిపి అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి

5లో

దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రజా పాలనను సాగిస్తున్నామని అన్నారు.





## తెలంగాణకు 4 వారాల్లో రెగ్యులర్ డీజీపీ

యూపీఎస్సీకి సుప్రీంకోర్టు ఆదేశం

రాష్ట్రాల్లో యాక్టింగ్ డీజీపీల నియామకం పరిపాటి అయ్యింది

రాష్ట్రాలు జాప్యం చేస్తే మా వద్దకు రండి

యూపీఎస్సీకి సుప్రీం ఆదేశాలు



05లో..

## గ్రామ పంచాయతీలకు

# గుడ్ న్యూస్

**నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ**




**హైదరాబాద్, ఫిబ్రవరి5:** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదలయ్యాయి. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపి.. కేంద్ర ఆర్థిక శాఖతో సంప్ర దింపులు జరపడంతో ఈ నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఈ నిధులు కొత్త ఊపిరి పోయను న్నాయి. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావడం, నూతన పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయి. గతంలో పంచాయతీల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధుల విడు దలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది.కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఎన్నికైన ప్రజాప్రతిని ధులు(సర్పం చ్‌లు) ఉంటేనే ఈ నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి బదిలీ చేస్తారు. ఇటీవల ఎన్నికలు ముగియడంతో ఈ ప్రక్రియ పూర్తయింది. పంచాయతీలకు అందిన ఈ నిధులను ప్రధానంగా మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా అవసరాల కోసం రాష్ట్ర సర్కార్ ఖర్చు చేయనుంది.

## ఆత్మహత్యలు.. వీడని మిస్టరీ

**కొనసాగుతున్న రైల్వే పోలీసుల దర్యాప్తు**

**సాంకేతిక ఆధారాలపై పోలీసుల ఆరా**

**హైదరాబాద్: ఫిబ్రవరి 5 :** చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున చెంగిచర్ల హరితవనం కాలనీలో నివాసముండే విజయారెడ్డి, ఆమె కొడుకు విశాల్‌రెడ్డి, కూతురు చేతనరెడ్డితో కలిసి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడిన ఘటన అందరినీ కలిచివేసింది. అయితే ఐదు రోజులవుతున్నా ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణం బయటపడ లేదు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, తోటి ఉద్యోగులతో, స్థానికులతో విజయారెడ్డికి తగాదాలు లేవు.. కేవలం ఒంటరి తనంతో ఉన్న ఆమె పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడడం అనేది మిస్టరీగానే మారింది. విజయారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేస్తుండగా, ఆమె మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్నారు. కూతురు చేతన ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం, కొడుకు విశాల్ ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ.. మొదటి సంవత్సరం చదువుతున్నారు. ప్రతి రోజు క్యాబ్‌లోని తన కార్యాలయానికి విజయరెడ్డి వచ్చిపోయేవారు. అయితే శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆమె తన సొంత కారులో ఇంటి నుంచి బయలుదేరారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఆమె తల్లి ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నావు? క్యాబ్ ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు.తనకు ఆఫీసులో పని ఎక్కువగా ఉందని, అందుకే తన కారులో వెళ్తున్నానంటూ తల్లికి సమాధానం చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. పిల్లలు ఉంటున్న హాస్టల్స్‌కు వెళ్లి తమ బంధువు చనిపోయారంటూ వాళ్లను ఆ రోజు రాత్రే తన వెంట తీసుకొచ్చారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ పార్కింగ్‌లో కారును పార్కు చేశారు. ఆ తరువాత రైలు పట్టాలపై ముగ్గురు నడుచు కుంటూ ఘట్‌కేసర్ వైపు వెళ్లారు. కొద్దిసేపట్లోనే ఎదురుగా గూడ్స్ రైలు వస్తుండడంతో తమ పిల్లల ఇద్దరిని కౌగిలించుకొని ఆమె రైలు పట్టాలకు మధ్యలోనే ఉండిపోయారు. రైలు పట్టాలపై ఎవరో ఉన్నారని గుర్తించిన గూడ్స్ రైలు లోకో పైలట్ హారన్ కొడుతూ గట్టిగా అరుస్తూ వచ్చాడు.. అయినా వాళ్లు అక్కడి నుంచి పక్కకు జరగకుండా ముగ్గురు హత్తుకొని అక్కడే ఉండిపోయారు. ఇం తలోనే రైలు వారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

జనోదయ



# ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**7వ వార్డు స్వతంత్ర అభ్యర్థి గుర్రం శ్రీనివాస్**



**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 5:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో 7వ వార్డ్ కౌన్సిలర్‌గా తనను ఆదరించి గెలిపిస్తే వార్డ్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర అభ్యర్థి గుర్రం శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం వార్డు పరిధిలోని జర్నలిస్ట్ కాలని,బాలాజీ టౌన్ షిప్, పద్మావతి కాలని, సాయి కుటీర్ కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్ధంగా వార్డ్ ప్రజలకు సేవలు అందించేందుకు పోటీలో ఉన్నానని తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డు ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు వచ్చానని తనను ఆదరించాలని కోరారు. వార్డ్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని తాను గెలిచిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీల నిర్మాణం చేపట్టి వార్డు అన్ని విధాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.వార్డు పరిధిలో ధార్మి క సేవా కార్యక్రమంలో బాగంగా తన సొంత స్థలంలో రామాలయం నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. వార్డులో అర్హులైన వృద్ధులు, వితంతు, దివ్యాంగులకు పెన్షన్‌లు మంజూరుకు కృషి చేస్తానన్నారు. వార్డులో దొంగల బెడద అధికంగా ఉందని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపడతామన్నారు. నిరుపేద ఉన్నత విద్యావంతులకు, క్రీడాకారులకు చేయూత నివ్వడమే కాకుండా నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమ లుకు కృషి చేస్తానన్నారు. వార్డ్ ప్రజలు తనను ఆదరించి తన బ్యాట్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలి పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన మద్దతు దారులు పాల్గొన్నారు .



## సమస్యాత్మక కేంద్రాలు, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన సీ పీ

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 5:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం బెల్లంపల్లి పట్టణంలో గుర్తించిన సమస్యత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు, బజార్ ఏరియా జెడ్పి హైస్కూల్లో ఏర్పాటుచేసిన రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ రూమ్స్, స్ట్రాంగ్ రూమ్ లను రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లు , సీసీ కెమెరాల నిర్వహణ, పోలీసు బందోబస్తు, పోలీస్ సిబ్బంది కేటాయింపు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసిపి ఏ. రవికుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

**కొత్తగా ఎన్నికైన సర్పంచులు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటూ, గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు.**

# సర్పంచులు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలి

**పజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

**సంక్షేమ పథకాల లబ్ధి కోసం లంచాలు ఇవ్వొద్దు**

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**జనోదయ, స్టేషన్ ఘన్పూర్, ఫిబ్రవరి 5:**

కొత్తగా ఎన్నికైన సర్పంచులు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటూ, గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదిక, ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలేరు మండలానికి సంబందించిన 26మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 26లక్షల 03వేల 016 రూపాయల విలువగల చెక్కులను, ధర్మసాగర్ మండలానికి సంబందించిన 69మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 69లక్షల 08వేల 004రూపాయల విలువగల చెక్కులను, కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన 6గురు కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 06లక్షల 696రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గ్రామాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని, ఎన్నికల తర్వాత అందరం కలిసి గ్రామ అభివృద్ధి కోసం పని చేయాలని అన్నారు.

**కళ్యాణ లక్ష్మి పథకం పేదోళ్లకు వరం...**

పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి పథకం కొంత ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇంట్లో ఆడపిల్ల పెళ్లి చేయాలి అంటే తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక లక్ష 116 రూపాయలు ఎంతో భరోసా ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో రైతు సంక్షేమపైన, మహిళా సంక్షేమం పైన ప్రత్యేకించి పేద వర్గాల సంక్షేమం పైన దృష్టి పెట్టి కొత్తగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు.

**సంక్షేమ పథకాల కోసం లంచాలు ఇవ్వొద్దు**

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో గాని, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల విషయంలో గాని సీఎంఆర్ఎఫ్ విషయంలో గానీ ప్రభుత్వ పథకాల విషయంలో ఎవరు కూడా ఒక్క రూపాయి వేరే వారికి లంచం రూపంలో ఇవ్వవలసిన అవసరం లేదని సూచించారు. మీకు రావలసిన ప్రభుత్వ పథకాలు మీ ఇంటికే వస్తాయి అని, మీ దగ్గరికి వస్తాయని తెలిపారు. అవినీతి అక్రమాలను తగ్గించి సుపరిపాలన అందిస్తూ ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వేగంగా ముందుకు తీసుకుపోవాలనే ఆలోచనతోనే ముందుకు వెళ్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్లు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థంగా సేవ చేసేందుకు పోటీ

**ఆదరించండి అభివృద్ధి చేస్తా**

**-9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బీమా మల్లేష్ -**



**జనోదయ, మందమర్రి ఫిబ్రవరి 5 :**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డ్ ప్రజలకు నిస్వార్ధంగా సేవలు అందించేందుకు కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్నానని తనను ఆదరించి గెలిపించాలని 9వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి బీమా మల్లేష్ కోరారు. గురువారం వార్డు పరిధిలోని న్యూ తిమ్మాపూర్, ఓల్డ్ తిమ్మాపూర్ , అమ్మ గార్డెన్ కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలసి ఓటు అభ్యర్థిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు వచ్చానని తనను ఆదరించాలని కోరారు. వార్డ్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని తాను గెలిచిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీల నిర్మాణం చేపట్టి వార్డు అన్ని విధాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. వార్డ్ ప్రజలు తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.




# ప్రధాన అభ్యర్థులకు అసమ్మతి సెగలు

**బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార సందడి మొదలైంది. ప్రధాన పార్టీల నుండి టిక్కెట్లు పొందిన అభ్యర్థులు వార్డుల్లో పార్టీ కార్యకర్తలతో ఓట్ల ప్రచారాన్ని ఘ రూ చేశారు. గతంలో కంటే ఈసా రి మున్సిపల్ ఎన్నికల పోరు అత్యం త ప్రతిష్టాత్మకతను సంతరించింది. టికెట్ల కేటాయింపులో ప్రధాన కాం గ్రెస్ పార్టీలో ఏర్పడ్డ ముసలం వా ర్డుల్లో ఆ పార్టీ అభ్యర్థుల ప్రచారం పై కాస్త ప్రభావితం చూపవచ్చన్న చర్చ నడుస్తోంది.**



**బెడిసి కొట్టిన టిక్కెట్ల పంచాయితీ**

**అసమ్మతి వార్డుల్లో ఓట్లు చీలే అవకాశాలు**

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 5:**

బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార సందడి మొదలైంది. ప్రధాన పార్టీల నుండి టిక్కెట్లు పొందిన అభ్యర్థులు వార్డుల్లో పార్టీ కార్యకర్తలతో ఓట్ల ప్రచారాన్ని ఘ రూ చేశారు. గతంలో కంటే ఈసారి మున్సిపల్ ఎన్నికల పోరు అత్యంత ప్రతిష్టాత్మకతను సంతరించింది. టికెట్ల కేటాయింపులో ప్రధాన కాంగ్రెస్ పార్టీలో ఏర్పడ్డ ముసలం వార్డుల్లో ఆ పార్టీ అభ్యర్థుల ప్రచారం పై కాస్త ప్రభావితం చూపవచ్చన్న చర్చ నడుస్తోంది. ఇక ప్రతిపక్ష బి ఆర్ ఎస్ పార్టీలో కూడా టిక్కెట్లు దక్కని అభ్యర్థులు ఒంటరి పోరుకు సిద్ధమై ప్రచార బాట పట్టారు. రెండు రోజుల కిందటి వరకు ప్రధాన కాంగ్రెస్ పార్టీకి అత్యంత క్రియాశీలక కార్యకర్తలుగా పనిచేసిన అభ్యర్థులే జెండా మోయని వ్యక్తులకు టిక్కెట్లు కట్టబెట్టి నికార్సైన కార్యకర్తలను అన్యాయం చేశారని పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని ధిక్కరిస్తూ ఆందోళనకు దిగిన విషయం పట్టణంలో ఎన్నికల ప్రచార సమయంలో హాట్ టాపిక్‌గా మారింది. అనర్హులకు అధిష్టానం పార్టీ టికెట్లను కేటాయించడం బాధిస్తుందని సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు పార్టీ కార్యాలయంలోనే మనోవేదనకు గురవడం పార్టీ శ్రేణులను, జెండాలు మోసిన కార్యకర్తలను అయోమయానికి గురిచేసింది. ఎన్నికల వేళ ఎదురుగాలి వీస్తున్నా అధికార కాంగ్రెస్ పార్టీ మిన్నకుండడంతో కాంగ్రెస్ అభ్యర్థులకు పోటీగా అసమ్మతి అభ్యర్థులు వార్డుల్లో పోటీ కోసం ప్రచారాన్ని చేపడుతున్నారు. ప్రచారంలో ఉన్న ప్రతిపక్ష బి ఆర్ ఎస్ అభ్యర్థుల్లోనూ అసమ్మతి సెగ వెంటాడుతుంది. ప్రధానపార్టీల్లో టికెట్లు ఆశించి నిరుత్సాహపడ్డ తాజా మాజీ నేతలు ప్రచారంలో పోటీ పడుతూ ఉండటంతో ప్రధాన పార్టీ అభ్యర్థులకు మింగుడు పడని అంశంగా మారింది. కాంగ్రెస్ , బీ ఆర్ ఎస్ పార్టీల్లో టికెట్ల పంచాయతీ ఆ రెండు పార్టీలో ఓట్లను చీల్చి పలుచోట్ల అభ్యర్థులపై ప్రభావాన్ని చూపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1 వ వార్డు లో టిక్కెట్టు దక్కకపోవడంతో కాంగ్రెస్ నాయకుడు అసమ్మతి సెగను రాజేశారు. తన తల్లిని ప్రధాన పార్టీలకు పోటీగా బరిలో దించారు. 4వ వార్డులో 8 మంది పోటీ చేస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థికి అసమ్మతి పోరు తప్పడం లేదు. బి ఆర్ ఎస్ అభ్యర్థి కూడా అక్కడ ప్రత్యర్థులకు బలమైన పోటీ ఇస్తున్నట్లు కనిపిస్తుంది. 14వ వార్డు నుండి ఏడుగురు పోటీలో నిలిచారు. 16వ వార్డులో పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. అక్కడ బి ఆర్ ఎస్ మాజీ అభ్యర్థి కాంగ్రెస్ నుండి టికెట్ ఆశించి భంగపడడంతో మళ్లీ టికెట్ కోసం బి ఆర్ ఎస్ గూటికి చేరారు. అయినా బిఆర్ఎస్ టికెట్ ఇవ్వక పోవడంతో స్వతంత్రంగా పోటీలో ఉన్నారు. ఇదే వార్డు నుండి బీ ఆర్ ఎస్ , కాంగ్రెస్, బిజెపి, స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీని స్తున్నట్లు కనిపిస్తుంది. 17వ వార్డులో ఈసారి ప్రధాన పార్టీలతోపాటు నలుగురు స్వతంత్ర అభ్యర్థులు బలంగా పోటీపడుతున్నారు. 18 వ వార్డులో జనసేన అభ్యర్థి ప్రధాన పార్టీ అభ్యర్థులకు పోటీగా ప్రచారం చేపట్టడం ఆసక్తిగా మారింది. 19 వ వార్డులో అధికార పార్టీ అభ్యర్థికి మాజీ కౌన్సిలర్ అసమ్మతి రాగం ఎత్తి తన కోడలిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంచారు. ఇదే వార్డులో ఎంఐఎం, బీఎస్పీ పార్టీతో పాటు మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉండడంతో ఎక్కడికక్కడ ఓట్లను చీల్చే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక 30వ వార్డులో అధికార పార్టీ అభ్యర్థికి మాజీ కౌన్సిలర్ కూతురు అసమ్మతి అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. 33 వ వార్డులో ప్రధాన అభ్యర్థులకు అసమ్మతి అభ్యర్థుల నుండి గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. 34వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థికి అసమ్మతి సెగ తప్పడం లేదు. టికెట్ల లాబీయింగ్‌లో వార్డుల్లో అవకాశాలను కోల్పోయిన మాజీ కౌన్సిలర్లు, ప్రధాన నాయకుల పోటా పోటీ ప్రచారం వల్ల వార్డుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

# ఇండ్లు కోల్పోతున్న వారిని ఆదుకుంటాం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో భద్రకాళి మాఢవీధుల కాలనీవాసులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష**

**జనోదయ , హనుమకొండ**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి మాడవీధుల నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలతో డబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కుడా, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్లు కోల్పోతున్న వారు తమ అభిప్రాయాలను కలెక్టర్‌కు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న తమకు మరొకచోట ఇండ్లు ఇవ్వాలని, కల్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రస్తుతం భద్రకాళి మాఢవీధుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సహకరిస్తున్నందుకు కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరపున ప్రయోజనాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ



పిడి సిద్ధార్థ నాయక్, మైనింగ్ ఏడి రవిశంకర్, జి డబ్ల్యూ ఎంసి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, జీడబ్ల్యు ఎంసీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఇతర అధికారులతో పాటు మాజీ కార్పొరేటర్ బోడ డిన్న పాల్గొన్నారు.




# హోరెత్తిన ఎన్నికల ప్రచారం

**అభ్యర్థుల గెలుపును సవాల్‌గా తీసుకున్న ప్రధాన పార్టీల నేతలు**

**తామేమీ తీసిపోమంటున్న స్వతంత్రులు**

**జనోదయ, బెల్లంపల్లి, ఫిబ్రవరి 5:**

బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార హోరు మొదలైంది. 34 వార్డుల్లో ప్రధాన అభ్యర్థులతో పాటు పోటీలో ఉన్న స్వతంత్రులు తమ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కేటాయించబడ్డ ఎన్నికల గుర్తులతో అభ్యర్థులు తమ తమ వార్డుల్లో ప్రత్యక్షమవుతున్నారు. ఒకవైపు అసమ్మతి అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు వార్డుల్లో తమ ప్రచారాన్ని పదునెక్కిస్తున్నారు. టికెట్లు దక్కక నిరాశ చెందిన అసమ్మతి అభ్యర్థులు ప్రధాన పార్టీలను ఢీకొనేలా తమదైన వ్యూహాలు రచిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ అధినేతలను వెంటబెట్టుకొని ప్రచారం చేపడుతూ ఓట్లు రాబట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. బిజెపి పార్టీ అభ్యర్థులు తమ తమ వార్డుల్లో గెలుపు కోసం తమదైన శైలిలో ప్రచారం చేపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి రాజేశ్వర్ పట్టణంలోని 16,28 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించి తమ పార్టీ అభ్యర్థులు కోయల్‌కార్ గోవర్ధన్, గాండ్ల మహేష్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రధాన కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పి బిజెపి పోటీ చేస్తున్న అన్ని వార్డుల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 31 వార్డులో బి ఆర్ ఎస్ బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి నగేష్ ముదిరాజ్‌తో కలిసి బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య అవార్డులో పోటీ చేస్తున్న బండి స్రవంతిని గెలిపించాలని కోరుతూ పార్టీ కార్యకర్తలతో వార్డులో పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. 26వ వార్డు రడగంబాల బస్తీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇప్ప కుమారస్వామి ఇంటింటికి ఓట్ల ప్రచారం నిర్వహించారు. 28వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి చిప్ప అర్చన, 12వ వార్డులో మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి జరుకుల లక్ష్మీని గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. అదే వార్డులో బి ఆర్ ఎస్ అభ్యర్థి ధరావత్ తిరుమల వాసు కార్యకర్తలతో ఇంటింటి ప్రచారాన్ని హోరెత్తించారు. 19 వ వార్డులో కూడా ప్రచార హోరు జోరెత్తింది. బీఎస్పీ అభ్యర్థి కోరాళ్లా రేచల్, కాంగ్రెస్ అభ్యర్థి కాంపల్లి దయామణి, బీ ఆర్ ఎస్ అభ్యర్థి షేక్ సిమ్రాన్, స్వతంత్ర అభ్యర్థులు గాయత్రీ దేవి ఠాకూర్, సిరికొండ స్నేహ,బండి పద్మ, మీనుగు సౌజన్య, కొమ్ముల జయలు గెలుపు కోసం పోటాపోటీగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఓట్ల కోసం అభ్యర్థించారు. అన్ని వార్డుల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తుండగా అసమ్మతి సెగ రాజేస్తున్న స్వతంత్రులు కూడా ప్రచారంలో తామేం తీసిపోమన్నట్లు ప్రచారాన్ని పరిగెత్తిస్తున్నారు. మొత్తం మీద ఎన్నికల ప్రచార పర్వం బెల్లంపల్లిలో రాజకీయాలను వేడెక్కిస్తోంది.







## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**21వార్డులో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం**



**జనోదయ, మందమర్రి జనవరి 5:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోత్కు సుదర్శన్ అన్నారు. పట్టణం లోని 21వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి జంగం కళ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురు వారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలన్నారు.రాష్ట్ర కార్మిక, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో 21వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కనుకుంట్ల కనకయ్య, కుదిరే రామస్వామి, భూపెల్లి రాయమల్లు,విజయగిరి కృష్ణమూర్తి,మల్లేష్, మజ్జి సీత, కామెర పద్మ, ఈదునూరి శశికళలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా ఉండండి

**బీఆర్ఎస్ స్టేషన్ ఘనపూర్ అభివృద్ధిని మరిచింది**

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**జనోదయ : స్టేషన్ ఘనపూర్:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోంది అని, మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం చాగల్ పరిధిలోని 6,7,8,9 వార్డులలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ కావ్య ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ...స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ రావడంతో అభివృద్ధి మహర్దశ ప్రారంభమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని వరంగల్ ఎంపీ అన్నారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికైన తరువాతనే స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ సాధ్యమైందని గుర్తు చేశారు. మున్సిపాలిటీ ఏర్పడిన వెంటనే 50 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించారని తెలిపారు. ఈ 50 కోట్ల నిధులు అవినీతిపరుల చేతుల్లో ఉండాలా... లేక అభివృద్ధి చేసే నాయకుల చేతుల్లో ఉండాలా... అనేది ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు.

**బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం...**

గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్టేషన్ ఘనపూర్ పట్టణ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల విషయంలో ప్రజలను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆరోపించారు. గత పాలకులు అవినీతి, ఆక్రమణలు, బెదిరింపులు, భూకబ్జాలతో పాలన సాగించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, కార్మికులు, పేద వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ పనిచేస్తోందని అన్నారు.తాను తన ఎంపీ నిధుల నుంచి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి రూ.3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో మరో 500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 6వ వార్డు అభ్యర్థి కనకం రమేష్, 7వ వార్డు అభ్యర్థి అన్నపు సుమలత, 8వ వార్డు అభ్యర్థి చాతర బోయిన సత్యనారాయణ, 9 వ వార్డు అభ్యర్థి సౌదరపల్లి సంపత్ రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య- శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి



**జనోదయ : చొప్పదండి, ఫిబ్రవరి 5:**

దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులు, విద్యార్థులు, నిరు ద్యోగులు, మహిళల సంక్షేమమే ప్రధా న లక్ష్యంగా ప్రజా పాలనను సాగిస్తు న్నామని అన్నారు. చొప్పదండి మండ´లం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతిబాట కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి గురువారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌ను పట్టిపీడిస్తున్న డంపుయార్డు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కరీంనగర్-వరంగల్ నగరాల మధ్య డంపుయార్డు నెలకొల్పి విద్యుత ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కరీంనగర్‌కు రింగ్‌రోడ్డు మంజూరు చేస్తామని, తద్వారా నగర అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు. కరీంనగర్, వరంగల్ నగరాలను కలిపి అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కరీంనగర్ గడ్డ నుంచే మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమై స్వరాష్ట్ర సాధన దోహద పడిందని గుర్తుచేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా లక్షల సంఖ్యలో ఇళ్లను లబ్ధిదా రులకు అందించామన్నారు. ఉచిత విద్యుత్ పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత కరెంటు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తుందని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి లా, ఎల్ఎల్ఎం, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేయనున్నట్లు వెల్లడిం చారు.తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయల రైతు బీమా పంపిణీ చేశామని, రైతులు పండిం చిన ప్రతి గింజను కొనుగోలు చేసి 48 గంటల్లోనే వారి ఖాతా ల్లో డబ్బులు జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో మహిళా సంఘాలకు వెయ్యి అద్దె బస్సులను కేటాయించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వాటికి యజమానులు మహి ళలేనని అన్నారు. అదానీ, అంబానీలకు దీటుగా మహిళలకు సోలార్ పవర్‌ప్లాంట్ల నిర్వహణ, వెయ్యి మెగా వాట్ల విద్యుత ఉత్పత్తి చేసే బాధ్యతలు అప్పగించామని చెప్పారు. జగిత్యా లలో రోడ్డు విస్తరణ, యంగ్ ఇండియా స్కూల్ కోసం స్థలాన్ని కేటాయిస్తామని సీఎం ప్రకటించారు. ఈ సభలో జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రజాప్ర తినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, కరీంనగర్ శ్రీ సీతా రామచంద్ర జిల్లా మహిళా సమాఖ్యకు రూ. 110.10 కోట్ల చెక్కును అందజేశారు.

# గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు ఓకే

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటి నుంచి విజయవంతంగా చేపట్టిన మొట్టమొదటి గ్రూప్-1 నియామకాలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలను కొట్టేస్తూ సింగిల్ జడ్జి గత ఏడాది సెప్టెంబర్ 9న ఇచ్చిన తీర్పును కొట్టేస్తూ.. హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం 123 పేజీల తీర్పును వెలువరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి, టీజీపీఎస్సీకి, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న విజయవంతమైన అభ్యర్థులకు భారీ ఊరట లభించినట్లయింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనంలో లోపాలు, డబుల్ హాల్‌టికెట్లు, పరీక్షా కేంద్రాల కేటాయింపు, కొన్ని సెంటర్లలో ఎక్కువమంది ఎంపిక కావడం, ఎంపిక చేసిన అభ్యర్థులను కొన్ని సెంటర్లకు కేటాయించడం, తెలుగు మాధ్యమ అభ్యర్థులపై వివక్ష, ఎవాల్యుయేటర్ల ఎంపికలో లోపాల వంటి కారణాలను చూపుతూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను కొట్టేయాలని.. గతంలో హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకుల జాబితాను కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు. ఆ తీర్పు చెల్లదని, తప్పులతడకగా ఉందని పేర్కొంటూ టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో రిట్ అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి, కమిషన్ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్ రాజశేఖర్, విజయవంతమైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రతివాదుల (రిట్ పిటిషనర్లు లేదా విజయవంతం కాని అభ్యర్థులు) తరఫున సీనియర్ న్యాయవాదులు రచనారెడ్డి, జి.విద్యాసాగర్, సురేందర్‌రావు తదితరులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. "పరీక్షల నిర్వహణలో అసమగ్రత, వివక్ష, భారీ లోపాలు, పేపర్ లీకేజీ వంటి వ్యవస్థీకృత తప్పిదాలు ఏమైనా ఉన్నాయా? అని చూడాల్సి ఉంటుంది. మాల్‌ప్రాక్టీస్ జరిగిందని ఎలాంటి అనుమానాలకూ తావులేని విధంగా నిరూపణ జరగాలి.సింగిల్ జడ్జి మొత్తం పరీక్షలను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని లేదా మోడరేషన్ పద్ధతిలో రీ-ఎవాల్యుయేషన్ చేయాలని తీర్పు ఇచ్చారు. తప్పు జరిగిందని నిర్ధారణకు వచ్చిన తర్వాత రీ-ఎవాల్యుయేషన్ చేస్తే మొదటి ఇచ్చిన మొత్తం మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాలన్న తీర్పు ఎలా అమలవుతుంది? కాబట్టి సింగిల్ జడ్జి తీర్పులో లోపం ఉంది. రెండు హాల్‌టికెట్ల జారీ అక్రమమని సింగిల్ జడ్జి పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రకారం రెండు హాల్‌టికెట్ల జారీపై ఎలాంటి నిషేధం లేదు. ప్రిలిమినరీ పరీక్షలకు, మెయిన్స్ పరీక్షలకు రెండు వేర్వేరు హాల్‌టికెట్‌లు ఇచ్చారు. మెయిన్స్ హాల్‌టికెట్‌లపై అభ్యర్థి ప్రిలిమనరీ హాల్‌టికెట్ నంబర్ కూడా ఉంది. సివిల్ జడ్జి, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వంటి పరీక్షల్లో సైతం రెండు హాల్‌టికెట్లు ఇచ్చారు. ఇలా ఇవ్వడం వల్ల నష్టం ఏంటి అనేది సింగిల్ జడ్జి వివరించలేదు. ర్యాండమైజేషన్ పద్ధతి పాటించినప్పుడు 18, 19 సెంటర్లకు కేవలం మహిళలు మాత్రమే ఎలా వచ్చారు? ఆ రెండు సెంటర్లలో పురుషులకు టాయిలెట్స్ లేకపోవడం, ఇతర లాజిస్టిక్స్ సమస్య ఉన్నందున అక్కడ కేవలం మహిళలను మాత్రమే కేటాయించారు. ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారు.




దీనివల్ల అన్యాయం జరిగినట్లు, ఏకపక్షంగా వ్యవహరించినట్లు కాదు. అందుకు ఆధారాలు లేవు. దివ్యాంగ అభ్యర్థుల సౌకర్యం కోసం సెంటర్ల సంఖ్యను 45 నుంచి 46కు పెంచారు. సెంటర్ల పెంపు కమిషన్ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. దీనికి దురుద్దేశాన్ని ఎలా ఆపాదిస్తారు? అలాగే మొత్తం అభ్యర్థుల సంఖ్యలో తేడాలు అనే విషయంలో కూడా.. ఆంగ్లంలో అర్హత సాధించని వారి ఫలితాలు నిలిపేయడం వల్ల తేడాలు ఉన్నట్లు కమిషన్ స్పష్టమైన వివరణ ఇచ్చింది. సమాధాన పత్రాల మూల్యాంకనంలో మూడో ఎవాల్యుయేషన్‌కు బార్ కోడ్, బబ్లింగ్ లేదనే విషయంలో.. మొదటి, రెండు ఎవాల్యుయేషన్‌లలో 15 శాతానికి పైగా తేడా ఉంటేనే మూడూ ఎవాల్యూయేషన్‌కు వెళ్తుందని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏ ఒక్క అభ్యర్థికో అనుకూలంగా ఎవాల్యుయేషన్ జరిగినట్లు ఎలాంటి ఆధారాలూ లేవు. అభ్యర్థుల మార్కులు ఎవరికి వారివే మాత్రమే కనిపించే విధంగా పబ్లిష్ చేయడం వల్ల నష్టం ఏమీ లేదు. మార్కులు తక్కువ వచ్చాయని భావిస్తే రీకౌంటింగ్ ఆప్షన్ ఉంది. ఎవాల్యుయేటర్ల ఎంపికలో తప్పులు జరిగాయని.. డాక్టర్ ఎంఏ మాలిక్ అనే ప్రైవేటు ట్యూటర్‌ను తీసుకున్నారనే ఆరోపణలకు కమిషన్ సమాధానం ఇచ్చింది.

# తెలంగాణకు 4 వారాల్లో రెగ్యులర్ డీజీపీ

**యూపీఎస్సీకి సుప్రీంకోర్టు ఆదేశం**

**రాష్ట్రాల్లో యాక్టింగ్ డీజీపీల నియామకం పరిపాటి అయ్యింది**

**రాష్ట్రాలు జాప్యం చేస్తే మా వద్దకు రండి**

**యూపీఎస్సీకి సుప్రీం స్పష్టమైన ఆదేశాలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 :** తెలంగాణలో రెగ్యులర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తిచేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)ను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు రెగ్యులర్ డీజీపీల నియామకం ఇష్టం ఉండదని, ప్రభుత్వాల ట్రాప్‌లో యూపీఎస్సీ పడొద్దని సూచించింది. పలు రాష్ట్రాల్లో యాక్టింగ్ డీజీపీలను నియమించడంపై అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో అన్ని అర్హతలున్న సీనియర్ అధికారులకు నష్టం జరుగుతోందని తెలిపింది. గత ఏడాది సెప్టెంబర్ 26న డీజీపీ జితేందర్ పదవీ విరమణ చేయడంతో, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డికి ప్రభుత్వం డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నియామకం 'ప్రకాశ్ సింగ్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమని సామాజిక కార్యకర్త టి.ధనగోపాల్‌రావు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. శివధర్‌రెడ్డి నియామకాన్ని నిలిపివేసి, నిబంధనల ప్రకారం రెగ్యులర్ డీజీపీని నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీంతో నాలుగు వారాల్లో రెగ్యులర్ డీజీపీ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం యూపీఎస్సీని ఆదేశించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ ఈ ఏడాది జనవరి 29న యూపీఎస్సీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. యూపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది నరేశ్ కౌశిక్, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదించారు. తెలంగాణ ప్రభుత్వం రెగ్యులర్ డీజీపీ నియామకానికి ప్రతిపాదనలు పంపలేదని, యాక్టింగ్ డీజీపీని నియమించుకుందని యూపీఎస్సీ తరఫు నరేశ్ కౌశిక్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'ప్రకాశ్ సింగ్ కేసులో 2006లో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. రాష్ట్రాలు డీజీపీ పదవీ విరమణకు మూడు నెలల ముందుగానే కొత్త డీజీపీ నియామకానికి సంబంధించి యూపీఎస్సీకి ప్రతిపాదనలు పంపాలి. ఆ పేర్లను పరిశీలించిన యూపీఎస్సీ ప్యానెల్ కొత్త డీజీపీకి సంబంధించి రాష్ట్రానికి సిఫారసు చేస్తుంది. కానీ, రాష్ట్రాలు ప్రతిపాదనలు పంపడంలో జాప్యం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే యాక్టింగ్ డీజీపీలను నియమించుకుంటున్నాయి. తెలంగాణ సైతం నూతన డీజీపీ నియామకం కోసం చేసే ప్రతిపాదనలను నిర్దేశించిన మూడు నెలల ముందు పంపలేదు' అని తెలిపారు. దీంతో అలాంటప్పుడు మీరు (యూపీఎస్సీ) తెలంగాణ ప్రభుత్వంపై ఎందుకు ధిక్కార కేసు దాఖలు చేయలేదని సీజేఐ ప్రశ్నించారు. పోలీసు సంస్కరణల కోసం సుప్రీంకోర్టు గతంలో ప్రకాశ్ సింగ్ కేసులో ఇచ్చిన స్పష్టమైన తీర్పును, మార్గదర్శకాలను రాష్ట్రప్రభుత్వాలు ఎందుకు పాటించటంలేదని నిలదీశారు. హైకోర్టు తీర్పుపై తాము స్టే విధిస్తే ఇప్పుడు తెలంగాణ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ అంశంలో తెలంగాణ నిర్లక్ష్యంతోపాటు యూపీఎస్సీ బాధ్యతను విస్మరించినట్లు కనిపిస్తోందని చురకలంటించారు. 'తెలంగాణలోరెగ్యులర్ డీజీపీ ఎలాగూ లేరు. కనీసం యాక్టింగ్ డీజీపీ కూడా లేకపోతే పరిస్థితి ఏమిటి? తెలంగాణ ప్రభుత్వం మూడు నెలల గడువు పాటించనప్పుడే మీరు కోర్టు ధిక్కార పిటిషన్ వేస్తే బాగుండేది. అప్పుడు మౌనంగా ఉండి.. ఇప్పుడు సాకులు చెబుతామంటే ఎలా?'అని యూపీఎస్సీ తీరును సీజేఐ ప్రశ్నించారు. రెగ్యులర్ డీజీపీలను నియమించటం రాష్ట్రాలకు ఇష్టముండదని, యాక్టింగ్ డీజీపీలంటేనే ఇష్టమని సీజేఐ వ్యాఖ్యానించారు. రాష్ట్రాల ట్రాప్‌లో పడొద్దని యూపీఎస్సీకి సూచించారు. ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోయినా, ప్రతిపాదనలు పంపడంలో జాప్యం చేసినా వెంటనే సుప్రీం కోర్టులో కోర్టు ధిక్కార అప్లికేషన్ దాఖలు చేయాలని సూచించారు. సకాలంలో స్పందించని రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యులపై (ప్రధాన కార్య దర్శులు/హోం కార్యదర్శులు) చర్యలు తప్పవని సీజేఐ హెచ్చరించారు. ఇకనైనా ఎంపానెల్ మెంట్ కమిటీ మీటింగ్ (ఈసీఎం) వీలైనంత త్వరగా నిర్వహించి తెలంగాణలో రెగ్యులర్ డీజీపీ నియామకానికి సిఫారసు చేయాలని యూపీఎస్సీని ఆదేశించారు.

# అదుపులేని మాటలు

- సీఎం రేవంత్ సార్...మీకిది తగునా?
- హార్వర్డ్‌లో నేర్చుకున్న పాఠం ఇదేనా?
- శృతిమించిన విమర్శలతో అనర్థమే



బీఆర్ఎస్‌ని కొట్టాలంటే బూతులతో కాదు

ఇచ్చిన హామీల అమలుతోనే జనాల మన్నన

మాటల ప్రభుత్వమా? చేతల ప్రభుత్వమా?

క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితి ఏంటి?

ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే గెలుపెవరిది?

నిజాలు తెలియకుండా రేవంత్ కళ్లకు కార్పోరేట్ మీడియా గంతలు






**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో నాయకత్వం అనే అంశం మీద సర్టిఫికెట్ అందుకోవడం సంతోషమే. హార్వర్డ్ యూనివర్సిటీ సర్టిఫికెట్ అందుకుని తెలంగాణకు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో ఎన్నికల భహిరంగ ప్రచార సభలో పాల్గొని చేసిన ప్రసంగం చూస్తే ఆయన నోటి పదును మరింత పెరిగినట్లుగా కన్పించింది.హార్వర్డ్ యూనివర్సిటీలో రేవంత్ ఏం నేర్చుకున్నారో తెలియదు కానీ..మునుపెన్నడూ లేనంత బూతుల పర్వాన్ని చదవడం గమనార్హం.**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో నాయకత్వం అనే అంశం మీద సర్టిఫికెట్ అందుకోవడం సంతోషమే. హార్వర్డ్ యూనివర్సిటీ సర్టిఫికెట్ అందుకుని తెలంగాణకు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో ఎన్నికల భహిరంగ ప్రచార సభలో పాల్గొని చేసిన ప్రసంగం చూస్తే ఆయన నోటి పదును మరింత పెరిగినట్లుగా కన్పించింది.హార్వర్డ్ యూనివర్సిటీలో రేవంత్ ఏం నేర్చుకున్నారో తెలియదు కానీ.. మునుపెన్నడూ లేనంత బూతుల పర్వాన్ని చదవడం గమనార్హం. బహుషా హార్వర్డ్ యూనివర్సిటీలో నాయకత్వ లక్షణాలు ఎలా పెంపొందించుకోవాలి? నాయకుడంటే ఎలా ఉండాలి? అనే అంశాల మీద ఎలాంటి శిక్షణ ఇచ్చారో తెలియదు కానీ సీఎం రేవంత్ మాత్రం గతంలో కంటే మరింత దురుసుగా తన నోటికి పనిచెప్పడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న నేత నుంచి అరెయ్..ఒరెయ్ ..ఎవడివిరా లాంటి పదాలు రావడం సిగ్గు చేటు. ఇటీవల ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చి విచారించిన సందర్భంలో తెలంగాణ జాతిపితకు నోటీసులు ఇస్తారా? అని బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేశారు.తెలంగాణ జాతి పిత కేసీఆర్ అవునో కాదో? అనేది ప్రజల అభిమానానికి సంబంధించిన అంశం.ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తిగా కేసీఆర్‌ని గొప్పగా కీర్తించేవారు ఉన్నట్లే విమర్శించేవారుంటారు.ఈ విషయంలో సీఎం రేవంత్ మిర్యాల గూడ సభలో మాట్లాడుతూ.. ఎవనికిరా నువ్వు జాతిపితవు, నీ జాతికి మాత్రమే నువ్వు జాతిపితవని మాజీ ముఖ్యమంత్రి, తనకంటే వయస్సులో పెద్దవాడైన కేసీఆర్‌పై రేవంత్ నోరుపారేసుకున్నారు.రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన కేసీఆర్ మీద చేసిన విమర్శలు కేసీఆర్ వ్యతిరేకులకు వినసొంపుగా అన్పించేవి.ఆ పాత్ర అంతటితో ముగిసిపోయింది. ఒక్కసారి సీఎం కుర్చీలో కూర్చున్న తర్వాత నోటి నుంచే వచ్చే ప్రతీ మాట ఎంతో విలువైనది..చేసే విమర్శల ప్రభావం సమాజం మీద తప్పక ఉంటుంది.

ఈ విషయాన్ని మరచిన సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వాడిన భాషనే సీఎం అయిన తర్వాత కూడా ఉపయోగిస్తుండటంపై విమర్శలను ఎదుర్కొ నేలా చేస్తోంది. అయితే ఎన్ని విమర్శలు వచ్చినా రేవంత్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రోజురోజుకు తన స్థాయిని మరచి ప్రతిపక్ష నేతల మీద శృతిమించిన పదాలను వాడటం పూర్తిగా అభ్యంతరకరం. ఇంతలా దిగజారి బూతులు వాడిన చరిత్ర గతంలో ఎన్నడూ చూడ లేదు. కేసీఆర్, కేటీఆర్, బండి సంజయ్ వంటి నేతల విమర్శలు కూడా హద్దులు దాటిన విషయం గతంలో చూశాం.వారి ప్రతిష్ఠ ప్రజల్లో పలచన అయిన విషయం మరువరాదు. అయితే సీఎం హెూ దాలో ఉన్న రేవంత్ రెడ్డి మైకు దొరికితే తను ప్రతిపక్ష నేత పాత్రలోకి మారిపోతుండటం గమనార్హం. హద్దులు దాటిన ప్రసంగాలు.. అనవసర పదప్రయోగాలు చేస్తుండటం ఆయన గౌరవాన్ని ఆయనే తగ్గించుకుంటున్నారనే అభిప్రాయం స్వంత పార్టీ నేతల నుంచే ఉంది. వాస్తవానికి సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ ఎదుగుదల ఇలాంటి పదప్రయోగంతోనే ముడిపడిందనే వారున్నారు.మొదటి నుంచి ఆయన తీరే అది.అయితే అదంతా గతం. ఒక్కసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత తన మాటలతీరు, హావభావాలు మార్చుకోవాల్సిందే.అలా చేయకుండా నేను ఇలానే తిట్ల దండకాలను చదువుతా..కార్యకర్తలు చప్పట్లు బాగా కొడుతున్నారు అనుకుంటే అది ఆయన చేస్తున్న తప్పిదమే.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయి మూడో ఏడాది నడుస్తోంది.ఈ క్రమంలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు మీద దృష్టి నిలపాల్సిన ముఖ్యమంత్రి కేవలం ప్రతిపక్ష నేత కేసీఆర్ అండ్ ఫ్యామిలీని టార్గెట్ చేయడం కాంగ్రెస్ పార్టీతోపాటు,ప్రభుత్వం మీద తప్పక ప్రభావం ఉంటుంది.ఇప్పటికే రేవంత్ సర్కార్ మీద అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.ఈ వ్యతిరేకత ఉప్పెన మాదిరిగా మారకముందే తన పాలనాతీరును మార్చుకోవాలి.కేవలం మాటల ప్రభుత్వమే చేతల ప్రభుత్వం కాదనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళుతోంది.గత కేసీఆర్ పదేండ్ల పాలనను రేవంత్ సర్కార్‌ని జనం పోల్చుకుంటున్నారు.అసలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం మీద ఎలాంటి అభిప్రాయం ఉందనే విషయాన్నే మరచి రోజురోజుకు పార్టీకి,ప్రభుత్వానికి డ్యామేజ్ చర్యలకు సీఎం రేవంతే పూనుకోవడం గమనార్హం.పాలనలో అనేక తప్పిదాలకు తోడు ఇటు తన నోటి దురుసుతో జనాల్లో రేవంత్ ప్రభ పూర్తిగా మసకబారింది.ఈ విషయాన్ని దాచిపెట్టిన ప్రధాన మీడియాలు తమ స్వలాభం కోసం రేవంత్ భజన చేస్తూ ఆయన కళ్లకు గంతలు కడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి దోహదపడిన అన్ని వర్గాలు ఇప్పుడు రేవంత్ సర్కార్‌కి వ్యతిరేకంగా బలంగా ప్రచారాన్ని చేపడుతున్నాయి.ఉద్యోగుల నుంచి జర్నలిస్టుల దాకా ఇప్పుడు రేవంత్ పాలనపై మండిపడుతున్నాయి. మెజార్టీ వర్గమైన రైతన్నలు రేవంత్ పాలనపై నిప్పులు కక్కుతున్నారు. ఇదంతా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితి.మరి ఈ పరిస్థితిని సరిచేసుకోకుండా కేవలం కేసీఆర్ అండ్ ఫ్యామిలీని టార్గెట్ చేయడం మీదనే రేవంత్ దృష్టి నిలపడం పూర్తిగా రాజకీయ వైఫల్యమే.బీఆర్ఎస్ శ్రేణులు తన మాటల తీరుతో కసిగా పనిచేసే పరిస్థితిని రేవంతే కల్పిస్తుండటం విశేషం. ప్రత్యర్థి పార్టీలను,నేతలను బూతులతో నిర్వీర్యం చేస్తామనుకోవడం తాత్కాలిక ఆనందమే అవుతుంది తప్ప మరొకటి కాదు.ఇప్పుడు కేసీఆర్‌ని ఎవడికి నువ్వు జాతిపితవురా..అంటూ ఆయన కమ్యూనిటీ మీదనే విరుచుకుపడటం.. రేవంత్ వాడిన భాషను కనీసం ఎడిట్ చేయకుండా కొన్ని తొత్తు మీడియాలు అలానే ప్రచురించడం... జర్నలిజం విలువలకు తిలోదకాలిచ్చిన పేపర్ కటింగులను కొందరు సామాజిక మాధ్యమాల్లో షేర్లు చేస్తూ తెగ హడావిడి చేస్తున్నారు. ఇలాంటి హడావిడి, మతిలేని చర్యలతో చివరకు కేసీఆర్‌కు నష్టం చేయకపోగా మరింత మేలు చేసే చర్యనే అవుతుంది. ఇప్పటికే రేవంత్ తన అవివేక చర్యలతో కేసీఆర్‌ని యాక్టివ్ చేస్తున్నారు.జనంలోకి రప్పిస్తున్నారు.గడిచిన ఎన్నికల్లో కారుకు అయింది కేవలం టక్కరు మాత్రమే. కొన్ని పొరపాట్లు చేయకుండా నాటి సిట్టింగు శాసనసభ్యులను కొంతమందిని మార్చి ఉండి ఉంటే మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వచ్చి ఉండేది.

ఇప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమే. పల్లెల నుంచి పట్నం దాకా బీఆర్ఎస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉన్నది.అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచే సామర్థ్యం ఉన్న నేతలు ఆ పార్టీలో ఉన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌ని వచ్చే ఎన్నికల్లో దెబ్బతీసి మళ్లీ కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాలంటే అది కేసీఆర్ అండ్ ఫ్యామిలీని బూతులతో తిట్టడమో లేక అతీగతి లేని కేసులతో ఇరుకున పెడితేనో కుదిరే పని కాదు. ఇలాంటి చర్యలతో ఓ వైపు బీఆర్ఎస్ శ్రేణులు పట్టుదలతో పనిచేసే పరిస్థితి కల్పిస్తుండగా మరోవైపు తటస్థ ఓటర్లలో కేసీఆర్ మీద సానుభూతి వస్తోంది.అందుకే ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చిత్త

**సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వాడిన భాషనే సీఎం అయిన తర్వాత కూడా ఉపయోగిస్తుండటంపై విమర్శలను ఎదుర్కొ నేలా చేస్తోంది. అయితే ఎన్ని విమర్శలు వచ్చినా రేవంత్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రోజురోజుకు తన స్థాయిని మరచి ప్రతిపక్ష నేతల మీద శృతిమిం చిన పదాలను వాడటం పూర్తిగా అభ్యంతరకరం. ఇంతలా దిగజారి బూతులు వాడిన చరిత్ర గతంలో ఎన్నడూ చూడ లేదు.**

శుద్ధి చూపాలి.కొత్త కొత్త హామీలు ఇవ్వకుండా ఇచ్చిన హామీలను పకడ్బందీగా అమలు చేయాలి.అలాదే నిర్ణయాలు ప్రకటించే ముందు పార్టీ నేతలు, మంత్రుల సలహాలు తీసుకోవాలి.మైకు దొరికితే పూనం వచ్చినట్లు మాట్లాడటం.. ప్రకటనలు చేయడం తర్వాత ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం వంటి చర్యలతో తనకు పాలన మీద పట్టులేదనే విషయాన్ని ప్రజలు తేలిగ్గా అర్థం చేసుకునే పరిస్థితి ఉంది.ఒక నిర్ణయం తీసుకునే ముందు దాని మంచీచెడులు ఆలోచించి..సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత ప్రకటించి పక్కాగా అమలు చేస్తే ప్రభుత్వం మీద ముఖ్యమంత్రి మీద జనాల్లో సదాభిప్రాయం ఏర్పడుతుంది.సీఎం మాటల మీద జనాల్లో విశ్వసనీయత పెరుగుతుంది. దురదృష్టవశాత్తు ఈ విషయంలో రేవంత్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. అదిగో ఫ్యూచర్ సిటీ అని హంగామా చేయడం చూశాం.ఉన్న నగరంలోనే మౌలిక వసతుల కల్పన సక్రమంగా లేదు.కొత్తగా మహానగరాన్ని నిర్మిస్తామని చెప్పడం ఏపీలో చంద్రబాబు నాయుడు అదిగో అమరావతి..ఇదిగో సింగపూర్ అన్నట్లే ఉన్నది.ఇక మూసీ సుందరీకరణ,హైడ్రావంటి అలివికాని,ఆచరణ సాధ్యంకాని పథకాలను నెత్తిన ఎత్తుకోడం పరిపాలనా అనుభవ లేమితోనే. ఇలా చెప్పుకుంటూపోతే సీఎంగా రేవంత్ ఆకట్టుకునే పాలన చేయలేకపోయారని చెప్పడంలో కొందరికి ఇబ్బందికరంగా ఉండొచ్చు. వీటన్నింటికి తోడు మంత్రులు,సీఎం మధ్య సఖ్యత లేకపోవడం,మీడియాలో కొందరు మంత్రులను టార్గెట్‌చేసి వారికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలను వచ్చిన వ్యవహారంలో పార్టీ ప్రతిష్ట,ప్రభుత్వ గౌరవం పూర్తిగా దిగజారింది.ఇలాంటి పరిస్థితుల్లో సీఎం రేవంత్ అప్రమత్తంగా ఉండకుండా తనే ప్రభుత్వ ఇమేజ్‌ని డ్యామేజ్ చేసేవిధంగా అహంకారపూర్తి భాషను ఉపయోగించడం మరింత ముందుకు వెళ్ళి కమ్యూనిటీ ప్రస్తావన తేవడం అనేది ఏరకమైన రాజకీయమో రేవంత్‌కే తెలియాలి.ఒక కమ్యూనిటీని దూషించడం అతిపెద్ద రాజకీయ తప్పిదమే. కేసీఆర్ ఈ పొరపాటు చేయలేదు.తన చుట్టూ ఉన్న అతిముఖ్య నాయకుల్లో ఎక్కువ శాతం రెడ్డి సామాజిక వర్గం నేతలే ఉంటారు.కులాల ప్రాతిపదికన చేసే విమర్శలు ఎప్పుడూ సత్ఫలితాలు ఇవ్వవు.పైగా ఆయా వర్గాల నుంచి శత్రుత్వం కొనితెచ్చుకున్నట్లవుతుంది. ఇప్పుడు రేవంత్ కూడా రోజుకోవర్గాన్ని దూరం చేసుకుంటున్నారు.ఇదంతా అనవసర రాజకీయమే.రాజకీయాల్లో రాణించాలంటే కేవలం నోటికి పదును ఉంటే సరిపోతుందనుకుంటే పొరపాటే.ఈ ఫార్ములా కొంతమేరకు పనిచేస్తుంది.తమకు పడని నేతను రాయగూడని భాషలో తిడుతుంటే ఆనందపడిపోయేవారుంటారు.. అలాంటివారికి ఇలాంటి చర్యలు ఆనందాన్ని ఇస్తాయి కావచ్చు.అయితే అలాంటి వారి సంఖ్య స్వల్పం.మరి అలాంటి వారికోసం నోరు పారేసుకోవడం విజ్ఞత అన్పించుకోదు. కొందరు కొన్ని కారణాలతో రాజకీయాల్లో పదవులు అందుకుంటున్నారు.కొందరు పార్టీకి చేసిన సేవలతో పదవులు దక్కించుకుంటుండగా మరి కొందరు కేవలం ప్రత్యర్థి నేతలు, పార్టీలను రాయగూడని భాషలో తిట్లదండకాలు అందుకుంటూ పదవులు దక్కించుకుంటున్నారు.ఇలాంటివారికి కొన్ని పార్టీలు పదవులు ఇస్తుండటం దురదృష్టకరం.మేము కూడా ఇలానే తిట్లదండకాలను నమ్ముకుంటే మాకు పదవులు దక్కుతాయని పోటీలు పడి ప్రత్యర్థి పార్టీల నేతల మీద నోరుపారేసుకుంటూ అధిష్టానం ముందు మార్కులు సంపాదించాలనే నీచమైన రాజకీయాలను కొన్ని పార్టీలు ప్రోత్సహించడం దారుణం.ఇలాంటి చర్యలను అడ్డుకోవాల్సిన ముఖ్యనేతలే తామే శృతిమించిన విమర్శలను చేస్తుండటం రాజకీయాల్లో బూతుల జాడ్యం పెరిగేలా చేస్తోంది. ఇప్పటికైనా అన్ని పార్టీల నేతలు ఈ అనైతిక రాజకీయానికి ముగింపు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే ప్రజలు ఛీకొట్టే పరిస్థితి తెచ్చుకుంటారు.తాజాగా ఓ కొత్త నటుడు పాడిన బూతు పాట మీద జనంలో వ్యతిరేకత ఎలా వచ్చిందో.. బూతు పాట పాడిన సదరు సినీ యాక్టర్‌ని సోషల్ మీడియాలో ఎంతలా విమర్శిస్తున్నారో ప్రతీ ఒక్కరికీ గుణపాఠం కావాలి.అది కేసీఆర్ అయినా రేవంత్ అయినా అందరికీ వర్తిస్తుంది.

......................

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**
**8074124190**